


*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఇచ్చుటలో ఉన్న హాయి..

"పింకథాన్"..

" బ్రెస్ట్ కేన్సర్ " గురించి అవగాహన కల్పిస్తూ, దాన్ని" మనందరమూ కలిసి ఎదుర్కొందాం, పోరాడదాం" అనే సందేశంతో భారతదేశంలోని ప్రముఖ నగరాలలో వివిధ తేదీలలో ఏడాది పొడుగునా మహిళల కోసమే నిర్వహించబడే 3,5, మరియు 10 కిలోమీటర్ల పరుగు పందేన్ని " పింకథాన్" అంటారు.

ముంబయిలో జరుగుతున్న ఆ కార్యక్రమానికి వచ్చారు రేఖా, ఆమె స్నేహితురాలు వైశాలి. పదేళ్ళ వయసునించీ మొదలుగా దాదాపు డెబ్భై ఏళ్ళవరకు ఉన్న వేలాది మంది పిల్లలతో, మహిళలతో ఆ ప్రాంగణమంతా కోలాహలంగా ఉంది. గ్రూపుల్లోనూ, ఒక్కరుగానూ ఆ బేనర్ల దగ్గర నిలబడి ఫోటోలు తీయించుకునేవారూ, టీ షర్టూ, బిబ్ లూ అవి ఇచ్చే పింక్ బాగ్ లు ఇచ్చే కౌంటర్ల దగ్గరా, నీళ్ళ సీసాలు పంచే చోటా కూడా అందరి హడావిడితో ఒకటే సందడి. ఎక్కడ చూసినా ఉల్లాసం, ఉత్సాహం, 'పదిమంది కలిసి చేసే ఏ పని అయినా అలాగే ఉంటుందేమో మరి' .

"ఇంతమందిని చూస్తే ఎంతో సంతోషంగా ఉంటుంది కదా? ప్రతీ ఏడాది పెరుగుతున్న సంఖ్య చూస్తే, ఈ మెసేజ్ మరింతమందికి చేరుతోంది కదా, దానివల్ల మరింత ఎక్కువమంది తమ ఆరోగ్యం గురించి జాగ్రత్త పడతారు, ఎందరివో ప్రాణాలు బలి తీసుకునే ఈ మహమ్మారి బారిన పడకుండా ఉంటారు, అనుకుంటేనే నాకు చాలా బాగా అనిపిస్తుంది " అంది వైశాలి.

"ఇలాంటి ఏ పరుగు పందెమైనా ఏదో ఒక ముఖ్యమైన విషయం మీద అవగాహన పెంచడానికే ఏర్పాటు చేస్తారు కదా, దీంట్లో ఏముంది? "అన్నట్టు నవ్వింది రేఖ.

తామిద్దరూ ఇలాంటి రేసులు ఎన్నింటిలోనో పాల్గొంటారు కానీ తన స్నేహితురాలు ఈ పింకథాన్ విషయంలో కాస్త ఎక్కువగా స్పందించడం రేఖకి కొంచం ఆశ్చర్యం గా ఉంటుంది, ఎప్పుడూ తరచి అడగలేదు కానీ, తన్ని బాగా కదిలించిన సంఘటన ఏదైనా ఉండి ఉంటుంది అనుకుంటుంది.

ఆ తర్వాత వారిద్దరూ రేస్ మొదలయ్యే లైన్ దగ్గరకి వెళ్ళడమూ, మరొక గంటన్నర తర్వాత చాలామంది తమ పరుగు ముగించడమూ జరిగింది. వేదిక మీద వివిధ వర్గాల్లో మొదటి మూడు స్థానాలలో వచ్చిన వారికి బహుమతులు ఇచ్చారు, తమ జాగరూకత వల్ల తొందరగా తెలుసుకుని, తగిన చికిత్సతో ఈ కేన్సర్ ని అధిగమించి నిజజీవితంలో విజేతలుగా నిలిచిన కొందరిని వేదిక మీదకి ప్రత్యేకంగా పిలిచి అభినందించి, మాట్లాడించారు. వారి ప్రసంగాలు ఎంతో ఉద్వేగభరితంగానూ, స్ఫూర్తిదాయకంగానూ ఉండడం వైశాలికెంతో నచ్చింది. సగం మంది పరుగు పూర్తి అయిపోగానే వెళ్ళిపోతారు, కానీ రేఖా, వైశాలీ మాత్రం ఇవన్నీ అయ్యాకనే బయలుదేరుతారు, అది వైశాలి కోరిక.

"క్రిందటిసారికంటే బాగా పరిగెత్తాము కదూ, ఇలాగే ప్రాక్టీస్ చేస్తే వచ్చేసారికి యాభై నిమిషాల్లోకి వచ్చేస్తాము" అంది రేఖ ఆనందంగా.

వారిద్దరూ అప్పటికే "వన్ అవర్ ఎక్స్ప్రెస్ గ్రూప్ "లో ఉన్నారు అంటే పది కిలోమీటర్ల దూరాన్ని గంట లేదా అంతకంటే తక్కువ టైములో పరిగెత్తగలిగేవారన్నమాట.

వైశాలి నవ్వింది రేఖ మాటలకి. ఇద్దరూ ఆగి ఉన్న కార్ దగ్గరకి రాగానే బాగ్ తీసి దాంట్లోంచి చెక్ తీసింది వైశాలి.

"ఫౌండేషన్ కి చెక్ ఇస్తానన్నాను" అని గబ గబా పాతికవేలకి చెక్ రాసి తీసుకెళ్ళి "ఆర్గనైజర్స్ కి ఇచ్చొస్తాను" అంటూ బయలుదేరింది.

"నీ ఫ్రెండ్స్ పదిమంది పేర్లతో మనిషికి ఆరువందలచొప్పున రిజిస్ట్రేషన్ చేయించావు, వారిలో నలుగురు వచ్చారేమో ఈ రోజు, ఫండ్ రైజింగ్ సరే సరి, ఇప్పుడు మళ్ళీ ఇది కూడానా?" అంది రేఖ.

మళ్ళీ అదే నవ్వు వైశాలి ముఖం మీద. కనీకనిపించని చిన్న నవ్వు, విరిసీ విరియని పూమొగ్గలా. కళ్ళల్లో కనిపించని ఏదో భావన.

"వెళదామా? పిల్లలు ఎదురు చూస్తూ ఉంటారు" అంది వైశాలి పరిగెత్తుకుని వెనక్కి రాగానే.

ఇద్దరూ కార్ ఎక్కారు. బయలుదేరేముందు భర్తలకి ఫోన్ చేసి పిల్లలు ఇంకా నిద్ర లేవలేదని తెలుసుకున్నారు.

అప్పుడు రేఖే అంది " సండే కదా, ఇంకో గంట వరకూ నిద్ర లేవరు, ఈ పాటికి హేమంత్, ఆనంద్ కూడా మళ్ళీ పడకేసి ఉంటారు, ఎక్కడైనా ఓ కప్పు కాఫీకి ఆగుదామా?" అని.

దగ్గరలోనే ఉన్న కాఫీ జాయింట్ లోకి ప్రవేశించారు ఇద్దరూ.

" ఒక లాటే, ఒక కెపుచీనో " అని ఆర్డర్ చేసింది రేఖ. వైశాలి మౌనంగా కూర్చుంది.

"ఐ యాం ఏ పింక్ సిస్టర్" అని రాసున్న చిన్న పింక్ కలర్ కాగితపు సంచీమీదున్న అక్షరాలను చేత్తో తడుముతోంది, చాలా ప్రియమైన వస్తువుని తాకుతున్న అనుభూతి ఆమె కళ్ళల్లో.

" వైశూ, నిన్నెప్పుడూ ఒక మాట అడుగుదామని అనుకుంటూనే నువ్వేమనుకుంటావో అని ఆగిపోయాను, ఇన్నాళ్ళుగా చూస్తున్నాను కదా, ఎప్పుడూ అందరికీ ఇన్ని రకాల సహాయం చేస్తూ ఉంటావు, పైకి చెప్పుకోవు సరే, అసలెప్పుడూ డబ్బు లెక్కపెడుతున్నట్టుగా కూడా కనిపించవు. పైసా, పైసా చూసి చూసి లెక్కపెట్టే వాళ్ళున్న ఈ రోజుల్లో ఇలా ఉండడం ఎలా సాధ్యం? ప్రత్యేకించి పింకథాన్ కి ఫండ్ రైజింగ్ పేరుతో కార్యక్రమం మొదలుపెట్టాను అంటావు కానీ అందులో ఎవరెంత ఇచ్చారో? నాకంటే ఎవరికి ఎక్కువ తెలుసు?" అంటూ అడిగింది రేఖ.

ఇది ఎన్నాళ్ళుగానో ఆమె మనసులో మెదులుతున్న ప్రశ్న, సంపాదించే ప్రతీవారూ దాచుకోవాలనే చూస్తారు, దానం చెయ్యడానికి పెదవులు కదిలినంత వేగంగా చేతులు కదలవు, చెక్కులమీద సంతకాలు చెయ్యవు, పర్సుల్లోంచి నోట్లు తియ్యవు, మహా అయితే పదో, పరకో ఎప్పుడో ఒక సారి ఇచ్చి చేతులు దులుపుకుంటారు, టాక్స్ రాయితీ వస్తుందంటే కొందరు ముందుకు వస్తారేమో. అందరూ అలా ఉంటారని కాదు కానీ చాలామంది అలాగే ఉంటారని రేఖ అభిప్రాయం. కానీ వైశాలి అలా కాదు. అతి చిన్న విషయాలకు కూడా చాలా స్పందిస్తుంది, స్పందించడమంటే కేవలం నాలుగు మాటలు చెప్పి ఊరుకోవడం కాదు, సహాయం అంటే ఆమె దృష్టిలో ఒక బాధ్యత, ఏదైనా అనుకుందంటే అది పూర్తయ్యేవరకూ ఒక యజ్ఞంగా భావిస్తుంది. ఆమెని అలా చూసినప్పుడల్లా ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది రేఖకి.

"పిల్లకి ఒంట్లో బావులేదు అని పని మనిషి అడగ్గానే మళ్ళీ ఇస్తావా?" అని అయినా అడగకుండా చేతిలో ఉన్నది ఇచ్చేస్తుంది. చదువుకోసం అంటే చెప్పనే అక్కరలేదు

తమ అపార్ట్మెంట్ పక్కనే పేవ్మెంట్ మీద ఎవరైనా చలికాలంలో దుప్పటి లేకుండా కనిపిస్తే వెంటనే ఇంట్లోవి నాలుగు దుప్పట్లు, అవి కొత్తవా, పాతవా అని కూడా చూడకుండా తెచ్చి ఇస్తుంది. ఆహారమైతే ఎప్పుడూ రెడీ.

ఇంక CRY ( చైల్డ్ రైట్స్ అండ్ యూ),' హెల్ప్ ఏజ్' లాంటి సంస్థలకి క్రమం తప్పకుండా సాయం చేస్తూనే ఉంటుంది. ఇవన్నీ అవసరం అయిన వారికి చేసేవి అయితే అన్నీ అమర్చుకోగల స్థాయిలో ఉన్న తన స్నేహితులకి కూడా ఎప్పుడేది కావాలన్నా మరొక ఆలోచన లేకుండా తోడుంటుంది, అది అర్ధరాత్రి హాస్పటల్ కి వెళ్ళవలసి రావడమైనా సరే, మరేదైనా సరే.

చాలా తక్కువ మందిముఖ్య స్నేహితులుంటారు వైశాలికి, అందులో రేఖ ఒకర్తి. వారిద్దరూ ప్రతీ ఏటా జరిగే "ముంబయి మారథాన్" లో మొదటిసారి కలిశారుముఖ్య. తర్వాత నెమ్మదిగా పెరిగిన వారి స్నేహం కొద్దికాలంలోనే గాఢంగా మారింది. ఇద్దరూ ఉండేది ఒకటే అపార్ట్మెంట్ కనక రెండు కుటుంబాలూ కూడా తొందరలోనే సన్నిహితమయ్యాయి. వైశాలి ఒక పెద్ద ఇన్వెస్ట్ మెంట్ ఫర్మ్ లో డైరెక్టర్ గా పనిచేస్తుంది, ఆమె భర్త హేమంత్ పెద్ద విదేశ బాంక్ లో మార్కెటింగ్ విభాగానికి అధిపతిగా ఉన్నాడు. రేఖా, ఆమె భర్త ఆనంద్ ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఉద్యోగులు.

పింకథాన్ రేస్ లో "ఫండ్ రైజింగ్" అనే ఒక అంశం ఉంటుంది, ఇష్టమైనవారు తమ స్నేహితులనించీ, బంధువులనించీ నిధులు సేకరించి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ కి ఇస్తారు. వైశాలి ప్రతీ సారి అందులో పాల్గొని తనే వీలైనంత ఎక్కువగా ధన సహాయం చేసి నిధికి అందిస్తుంది. దానికి తోడు ఈ సారి అదనంగా పాతికవేలు ఇవ్వడం రేఖ ఆశ్చర్యానికి కారణం.

కాస్త చూసి ఇవ్వమంటుంది రేఖ, పరవాలేదంటుంది వైశాలి.

"వారు నీకేమిస్తారు తిరిగి?" అంటుంది రేఖ.

"తిరిగి ఏదో చేస్తారని ఆశించి చేస్తే అది సాయమవుతుందా? అంటుంది వైశాలి.

"తిరిగి ఇవ్వకపోతే ఏం చేస్తావ్? అంటుంది రేఖ.

"ఇస్తారని నేను అనుకోను, అందుకు నాకేమీ అనిపించదు" అంటుంది వైశాలి.

మిగిలిన విషయాలన్నింటిలోనూ ఏక మాటగా ఉండే స్నేహితురాళ్ళిద్దరికీ ఈ ఒక్క విషయం లోనే కొద్దిగా అభిప్రాయ భేదాలు వస్తూ ఉంటాయి. కానీ అంతలోనే మర్చిపోతారిద్దరూ, అది పరిణతి చెందిన వారి వ్యక్తిత్వాల వల్ల సాధ్యం అవుతుంది..

" నా డబ్బు నా ఇష్టం, నీకెందుకు?" అని అనదు వైశాలి.

" నీ మంచి కోసమే చెప్తున్నాను,లేకపోతే నాకేం, నీ డబ్బూ, నీ ఇష్టం" అని రేఖా వెటకారమాడదు.

"దేవుడి దయవల్ల నేనూ, హేమంత్ బాగానే సంపాదిస్తున్నాము, మూడు ఇళ్ళు కొన్నాము, కంపెనీ వాళ్ళిచ్చినవీ, సొంతవీ, కావలసినన్ని కార్లున్నాయి. పిల్లలని బాగా చూసుకోగలమనే ధైర్యముంది, మనకి కావలసినవన్నీ ఉన్నాయి కనక, నిజంగా అవసరమున్నవారికి కొంత సహాయం చేస్తే మనకి అక్కరలేనివాటిమీద అనవసరపు మక్కువ ఉండదేమో అని" అంటుంది నవ్వుతూ.

"కాఫీ వచ్చింది వైశూ, ఏమిటంత ఆలోచన? నేనేమైనా తప్పుగా మాట్లాడానా? నిన్ను బాధ పెట్టలేదు కదా? నాకు తెలుసు పింకథాన్ అంటే నీకు ఎంత ఇష్టమో? ఈ సారి కొత్తగా ఎక్కువ ఎందుకిచ్చావు అని అడిగాను అంతే, మరేమీ లేదు, నీ మనసునొప్పిస్తే సారీ" అంది రేఖ నెమ్మదిగా.

" అలాంటిదేం లేదు రేఖా, నీ మాటలనెప్పుడైనా నేను తప్పుగా తీసుకోగలనా? నీ మనసు నాకు తెలీదా? నీకు తెలియనిదే నా కథ. అదే నా ప్రవర్తనకి కారణం" అంది తాను కూడా అతి నెమ్మదిగా.

"కథా? కథేమిటి? ఎప్పుడూ చెప్పలేదే" అంది రేఖ ఆశ్చర్యంగా

"నిజమే, ఎప్పుడూ నీతో చెప్పనే లేదు, అవసరం రాలేదు, కానీ ఈరోజెందుకో బాగా గుర్తొస్తోంది, పాటీ, ప్రకాష్ అంకుల్, అన్నయ్యలూ, లతాంటీ అందరూ బాగా గుర్తొస్తున్నారు అంది.

"పాటీ, ప్రకాష్ అంకుల్ అంటే ఎవరు? మీ బంధువులే కదా, మీ అన్నయ్యలు ఇద్దరు వచ్చారు కదా మీ ఇంటికి?" అడిగింది రేఖ.

"అంతకంటే ఎక్కువే, నీకు తెలుసు కదా మాది జమ్షెడ్ పూర్. 'జమ్షెడ్ జీ నౌరోజీ టాటా 'అనే దార్శనికుడి కృషి ఫలితంగా వెలసిన నగరం అది. అక్కడ స్టీల్ ప్లాంట్, టాటా వారి మరిన్ని అనుబంధ సంస్థలూ, అవి నడిచే తీరూ, ఆ ఉద్యోగులకు కావలసిన సదుపాయాలూ, అవన్నీ చూసి తీరాలి కానీ చెప్పనలవి కాదు. ఒక్క మనిషి తలచుకుంటే ప్రజాహితం కోసం ఎంత సాధించవచ్చో! అనేదానికి ప్రత్యక్ష సాక్ష్యం టాటా నగర్.

ఎక్కడ పుట్టారో తెలియని, ఎవరూ లేని మా నాన్న నన్నూ, మా అమ్మనీ తీసుకుని పొట్ట చేత్తో పట్టుకుని ఆ ఊరు చేరారుట, ఆ తర్వాత టాటా స్టీల్ కంపెనీ లో న్యాయ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్న ప్రకాష్ శ్రీనివాసన్ గారి దగ్గర డ్రైవర్ గా చేరారుట. నాకు ఊహ తెలిసేసరికి మేము వారి ఔట్ హౌస్ లో ఉండేవాళ్ళం. నాన్న వారింట్లో డ్రైవర్ గా పని చేస్తే అమ్మ వారింట్లో మిగతా పనులన్నీ చూసుకునేది.

ప్రకాష్ గారింట్లో ఆయనా, భార్య లతా, ముగ్గురు కొడుకులూ, ఆయన అమ్మ అంబుజం మామీ ఉండేవారు. ముగ్గురూ మగపిల్లలు కావడం చేత ప్రకాష్ గారి భార్యకీ, అమ్మగారికీ కూడా నేనంటే ఎంతో ఇష్టంగా ఉండేది. నాకు తెలిసి నా చిన్నప్పటినించీ స్కూల్ ఫీజులు, బట్టలూ, బొమ్మలూ అన్నీ వాళ్ళే కొనేవారు. నన్నెప్పుడూ బయట పిల్లలా చూసేవారు కాదు, అమ్మా, నాన్నా వారింట్లో పని చేసినా నేను మాత్రం దర్జాగా వారింట్లో యువరాణిలా తిరిగేదాన్ని, సొంత అన్నయ్యలతో మెలిగినట్లే వాళ్ళ అబ్బాయిలతో ఆటలాడేదాన్ని, పోట్లాడేదాన్ని, సోఫాలో కూర్చుని టీ.వీ చూసేదాన్ని, డైనింగ్ టేబిల్ మీద వారితోనే తినేదాన్ని.

అమ్మ ఎప్పుడైనా కోప్పడబోతే పాటీ అమ్మనే కేకలేసేవారు. " ఆడపిల్ల ఇంట్లో లక్ష్మి లాంటిది, ఆ ముఖంలో కళ చూశావా? ఎంతో పెద్ద చదువులు చదివి మనందరికీ మంచి పేరు తెస్తుంది చూడు, దాన్నేమీ అనకు, అది నాకు దేవుడిచ్చిన మనవరాలు " అనేవారు. లతాంటీ కూడా ఆవిడకి వంత పాడేవారు. వారిద్దరూ కలిసి ఇంగ్లీష్ పేపర్ చదివేవారు, చదరంగం ఆడుకునేవారు. నేను కూడా పాటీతో చాలా ఆటలు ఆడేదాన్ని, ఆవిడ చాలా తెలివైన ఆవిడ, చాలా లోకజ్ఞానం కల మనిషి, స్కూళ్ళగురించీ, చదువులగురించీ, పోటీ పరీక్షలగురించీ బాగా తెలుసు ఆవిడకి, ఎప్పుడూ నాకు, వాళ్ళ మనవలకీ బాగా చదువుకోవాలనీ, బుద్ధిగా ఉండాలనీ చెప్పేవారు.

నేను పదో క్లాస్ లో బోర్డ్ పరీక్షలలో స్కూల్ ఫస్ట్ వచ్చినప్పుడు ఆవిడ ఎంత హడావిడి చేశారో చెప్పలేను, స్వయంగా "అతిరసాలు ( అరిశెలు)", మురుకులూ వండి అందరికీ పంచారు. అన్నట్టు నాకు వైశాలి అనే పేరు కూడా ఆవిడే పెట్టారుట,ఎందుకో తెలీదు, ఆవిడకి బుద్ధుడంటే చాలా ఇష్టం, బుద్ధుడు చివరి సందేశం ఇచ్చిన ఆ ఊరు బీహార్ రాష్ట్రంలోనే ఉంది, ఆ పేరునే నాకు వైశాలి అని పెట్టారు. 'వైశూ' అంటూ ముద్దుగా పిలిచేవారు. రాత్రి కూడా ఒక్కోసారి నేను ఆవిడ గదిలోనే ఆవిడ చెప్పే కథలు వింటూ నిద్రపోయేదాన్ని.

అలా నా చదువూ, జీవితమూ సాఫీగా సాగుతున్న రోజుల్లో పాటీ ని ఈ కేన్సర్ మాకు దూరం చేసింది. మొదటిసారి ఆవిడ చూసుకునేసరికే కాస్త ఆలస్యం అయినా, సరి అయిన టైముకు ఆపరేషన్ చేసి ఆవిడని కాపాడగలిగారు, కానీ అప్పటినించీ ఆవిడ మళ్ళీ మాములు మనిషి కాలేకపోయారు. చాలా దిగులు పడిపోయి, దాదాపు డిప్రెషన్ లోకి వెళ్ళిపోయారు. ఒకసారి వస్తే, అది తగ్గేది కాదు, మళ్ళీ వస్తుందని ఆవిడ బలంగా నమ్మేవారు, ఆవిడ భయపడ్డట్టే మొదటిసారి వచ్చిన దాదాపు రెండేళ్ల లోపే మళ్ళీ కేన్సర్ సోకింది, మరలా ఆపరేషన్ చేసే సమయంలో విపరీతమైన ఇన్ ఫెక్షన్ అయింది,, దానికి తోడు పెద్ద వయసు.

నీకు తెలుసా రేఖా? ఆవిడ బ్రతకడానికి ఎన్నిరోజులుందో ? తెలియని టైములో ఆవిడ నన్నూ, అంకుల్ నీ, ఆంటీనీ పిలిచారు. వజ్రాల దుద్దులూ, ముక్కున ఏడురాళ్ళ వజ్రాల బేసరి వెలుగులతో పోటీపడే వర్చస్సుతో కళ కళ లాడుతూ ఉండే ఆవిడని అలా మంచానికి అతుక్కుని పోయినట్టున్న స్థితిలో చూడటం నా వల్ల కాలేదు.

"పాటీ," అని ఆవిడని పట్టుకుని ఏడ్చేశాను.

" నీ చదువూ, పెళ్ళీ చూస్తాననుకున్నాను వైశమ్మా, ధైర్యంగానే ఉన్నాననుకున్నాను, కానీ ధైర్యం ఎప్పుడూ ఒకళ్ళకి చెప్పడానికే తప్ప తన దాకా వస్తే పిరికితనమే అని అర్ధం అయింది. నువ్వు తప్పకుండా ఐ.ఐ.టీ లో సెలెక్ట్ అవుతావు, నువ్వెంత చురుకైనదానివో, తెలివైనదానివో నాకు తెలుసు, మీ ఆంటీ అంకుల్ కూడా ఎప్పుడూ అంటారు వైశు తప్పక ఎంపిక అవుతుంది అని. మీ అన్నయ్యల్లో ఇద్దరు ఇంజనీరింగే చదవనన్నారు, ఒకడు మాత్రం ఇక్కడ ఎన్. ఐ.టీ లో చేరాడు కదా" అని ఆవిడ చెప్తూండగానే

"అమ్మకీ, నాన్నగారికీ తమ మనవళ్ళల్లో ఒకరైనా ఐ,ఐ.టీ లో చేరాలని కోరిక" అన్నారు అంకుల్ అంతలో.

"పరవాలేదు, ఈ మనవరాలు తప్పక తీరుస్తుంది ఆ కోరికని, కదమ్మా "అన్నారు నా చెయ్యి పట్టుకుంటూ.

నాకేమనాలో తెలీలేదు. చూస్తూ కూర్చున్నాను పొడవైన సూటైన ఆవిడ ముక్కునీ, ఆశతోనూ, తడితోనూ మెరుస్తున్న ఆవిడ కళ్ళనీ, పట్టలేని బాధని పళ్ళబిగువున భరిస్తూ కూడా చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తున్న ఆవిడ పెదవులనీ మాత్రమే కాదు, అన్నీ కలిసిన ఆ అందమైన ముఖంలో నా మీద ఉన్న అభిమానాన్నీ, నమ్మకాన్నీ.

నేను అలా చూస్తూ ఉండగానే అవిడ నా చేతిలో ఒక చెక్ పెట్టారు. ఆవిడ సంతకం చేసిన బ్లాంక్ చెక్ అది.

" నీకు సీట్ తప్పక వస్తుంది, అప్పుడు నీ ఫీజ్ కట్టడానికి మీ నాన్న ఇబ్బంది పడకూడదు కదా, ఇలాగే నువ్వు దేశంలోని అన్ని గొప్ప పోటీ పరీక్షల్లోనూ నెగ్గి ఎంతో పెద్ద ఉద్యోగం చెయ్యాలి, గొప్పదానివి కావాలి, పిల్లా, పాపలతో చల్లగా ఉండాలి" అన్నారు. ఆవిడ చేతిలో నా చెయ్యి, నా చేతిలో అవిడిచ్చిన చెక్కూ, ఆ స్పర్శా ఇప్పటికీ నా చేతిమీద ఉన్నాయి."ఆ రోజు నా కళ్ళల్లో ఇప్పటికీ సజీవంగా ఉంది రేఖా, కావాలనుకున్నానేను మర్చిపోలేను. అలాంటి రోజునీ, అలాంటి మనుషులనీ ఎవరైనా మర్చిపోగలరా?

కేవలం పాటీకోసమే పట్టుదలగా చదివి ఐ.ఐ.టీ లో సీట్ తెచ్చుకున్నాను, అప్పటికావిడ చివరి రోజుల్లో ఉన్నారు, నా అదృష్టం నేను ఐ.ఐ.టీ లో ఎంపికైన సంగతి ఆవిడ విన్నారు, నేను కాలేజీలో వారం రోజుల్లో చేరుతాననగా..

పూర్తి చేయలేనట్టు ఆపింది. ఆమె కనుకొలకులో చేరిన కన్నెటిచుక్కని చిటికెన వేలి గోరుతో తుడుచుకుంది, నాకు పెద్దగా ఏమోషన్స్ చూపడం తెలీదు రేఖా, కానీ పాటీని తలుచుకున్నప్పుడల్లా నాకే తెలియని ఏదో బాధ, నాలో సుళ్ళు తిరుగుతుంది, సరి అయిన టైములో గుర్తించడం ఎంత ముఖ్యమో, దాని గురించి పూర్తి అవగాహన కలిగి ధైర్యంగా ఎదుర్కోవడం కూడా అంతే ముఖ్యం కదా, ఇవి రెండూ తెలియకా, చూసుకోకా ఎందరో బలి అవుతున్నారు కదా, ఈ విషయాల ప్రాతిపదిక మీద జరిగే ఈ పరుగు పందెం అంటే నాకందుకే ప్రత్యేకం.

నువ్వెప్పుడూ అడుగుతావు కదా, చూసి ఇవ్వచ్చు కదా, అందులో ఎందరికి అపాత్రదానం చేస్తున్నావో, అందరినీ అమాయకంగా, గుడ్డిగా నమ్మేస్తావు అని. నిజమే కావచ్చు, కానీ మనుషుల్ని నమ్మడం ముఖ్యం నాకు, ఎవరో ఒకరిద్దరు తప్పుగా ప్రవర్తించారని మొత్తం అందరినీ అనుమానించలేం కదా, అదే నిజమైతే ఎక్కడివాళ్ళమో తెలియని మమ్మల్ని సొంత వారికంటే ఎక్కువగా ఆదరించిన ప్రకాష్ అంకుల్, లతా ఆంటీ, పాటీ, అన్నయ్యలూ ఎందుకు ఇంతగా మమ్మల్నిఅభిమానించాలి.?

ఎనిమిదేళ్ళక్రితం అంకుల్,నాలుగేళ్ళక్రితం ఆంటీ పోయారు, అయినా సరే అన్నయ్యలిప్పటికీ నాతో సొంత చెల్లెలికంటే ఎక్కువగా ఉంటారు. ఇదంతా ఎలా సాధ్యం? వారి పెంపకంలో వారి బిడ్డలా పెరిగిన నేను వారినించి ఏం నేర్చుకోవాలి? చెప్పు. **ఇచ్చుటలో ఉన్న హాయి పుచ్చుకున్ననాలాంటి వారికంటే ఎక్కువ ఎవరికి తెలుస్తుంది** ? వారి సాయం వల్ల నేనీనాడు ఈ స్థితిలో ఉన్నాను, నేను కనీసం ఒకరిద్దరికి సాయపడినా అది నా అదృష్టంగా భావిస్తాను. అప్పుడే పుచ్చుకున్న నాకు ఇచ్చుటలో ఉన్న హాయి పూర్తిగా అర్థమవుతుంది, నాణేనికి రెండో వైపు అర్ధం గోచరిస్తుంది కదూ" అంటూనే కాఫీలకి బిల్ ఇచ్చేసింది.

"వైశూ, ఈసారి నాది కాఫీ అని ముందే అనుకున్నాం కదా" అంది రేఖ కోపంగా.

" నెక్స్ట్ టైం బెటర్ లక్ మై ఫ్రెండ్" అంటూ నవ్వుతూ లేచింది వైశాలి.

Click here to share your comments on this story